క్లుప్తంగా

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బాలానగర్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు ఉప్పొంగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి శనివారం పలు కాలనీల్లో పర్యటించారు. సమస్యను పరిష్కరిందుకు అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురవవచ్చునని వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులను అప్రమత్తం చేసి డ్రైనేజీ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: వెంకటేశ్వరనగర్‌కు చెందిన అశ్విని లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకుంది. చికిత్స అనంతరం ఆమె భర్త ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేశాడు. శనివారం కూకట్‌పల్లి బీఆర్‌యస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు బాధితురాలి మంజూరైన రూ.60 వేల చెక్కును ఆమె భర్త వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపింది.

బంజారాహిల్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వెంకట్రావు

మోతీనగర్: లయన్స్ క్లబ్ బంజారాహిల్స్ శాఖ 51వ అధ్యక్షుడిగా కెల్లా వెంకట్రావును ఎన్నుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 23న ఆదివారం మోతీనగర్ జాన్సన్ బ్యాంక్ హాల్‌లో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా లయన్ ఎం. కైలాష్, కోశాధికారిగా కాసుల శ్రీకాంత్, సభ్యులుగా లయన్ నాగరాజు, వెంకట్రావు, ఆదినారాయణ ఎన్నికయ్యారన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాజగోపాల్‌రెడ్డి, హబీబ్ సుల్తాన్ అలీ, డి.కోటేశ్వరరావు, మహేంద్ర కుమార్ రెడ్డి, రోణంకి జగన్నాథం, గోపాలకృష్ణ, ప్రోగ్రామ్ చైర్ పర్సన్ సీఎస్ సత్యనారాయణ, ఎం.విజయలక్ష్మీ హాజరు కానున్నట్లు తెలిపారు.

రాజీవ్‌గాంధీనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



రాజీవ్‌గాంధీ నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. శనివారం ఆమె రాజీవ్ గాంధీ నగర్‌లో ముంపు ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఆర్‌కె సొసైటీలో చెత్తా చెదారం పేరుకుపోవటంతో రాంకీ సిబ్బందిని పిలిపించి తరలించే విధంగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, నాయకులు జ్ఞానేశ్వర్, రియాజ్, అశు, రమేష్, బాబా, ముత్యాల దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సహాయక చర్యలు



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కొంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం యాదవ్

కుత్బుల్లాపూర్: వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. శనివారం ఆయన అధికారులతో కలిసి ముంపునకు గురైన ఉమా మహేశ్వర కాలనీ, జయభేరి పార్క్, అశోక అలా మైసన్, నూజివీడు సీడ్స్ కంపెనీ ప్రాంతాల్లో పర్యటించారు. వరదనీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్ చింతల రవీందర్ యాదవ్, సిబ్బంది ఉన్నారు.



ఆల్విన్‌కాలనీ సాయినగర్‌లో రెస్క్యూ హోమ్ ప్రధాన గేటు వద్ద ఆగిపోయిన బ్రిడ్జి





పరికి చెరువును పట్టించుకోరా..?

- ప్రతి వర్షాకాలం ఇబ్బందులే
- సమస్యలను పరిష్కరించాలని స్థానికుల వినతి



ఆల్విన్‌కాలనీలోని పరికి చెరువు నాలా వద్ద ఏపుగా పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలు, ఆనుకొని ఉన్న నివాస గృహాలు

ఆల్విన్‌కాలనీ: నగరంలో ప్రతి వర్షాకాలం ఏదో ఒక సమస్య ఎదురవుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధుల్లో మార్పు కనిపించటం లేదని ప్రజలు మండిపడుతున్నారు. వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా నాలాలు, కుంటలు, బ్రిడ్జిలపై ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.కానీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పరికి చెరువు నాలా ఆల్విన్‌కాలనీ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు ప్రవహిస్తూ వుంటుంది. ప్రతి వర్షాకాలంలో పరికి చెరువు నాలాతో స్థానికులు ఇబ్బందులుపడుతూనే ఉన్నారు .గత 4 సంవత్సరాల క్రితం పరికి చెరువు నాలా ఉప్పొంగి ఆల్విన్‌కాలనీ, ధరణినగర్ పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. కొన్ని నెలల వరకు ముంపు సమస్య తీరలేదు. నాడు అధికారులు హడావుడిగా నాలాకు ఇరువైపులా కంచె గోడలు ఏర్పాటు చేస్తామని 5 కోట్ల వరకు నిధులు వెచ్చించి కొద్ది దూరం వరకు నాలా గోడలను నిర్మించి వదిలేశారు. ఈ నాలాకు ఇరువైపులా అనేక కాలనీలు, బస్తీలు ఉన్నాయి. పిచ్చి మొక్కలు పెరిగిపోయి వర్షపు నీరు సాఫీగా ప్రవహించకుండా అడ్డుపడుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడల్లా వరద నీరు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు మొర పెట్టుకుంటున్నారు. చెట్లు కూలిపడుతున్నాయని, పాములు, తేళ్లు, జెర్రిలు వంటి క్రిమీ కీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తుగా నాలాకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు. పన్నులు వసూలు చేయటంలో ఉన్న శ్రద్ధ మౌలిక వసతులు కల్పించటంలో లేదని వాపోయారు. ఇక ఆల్విన్‌కాలనీ సాయినగర్‌లో రెస్క్యూ హోమ్ వద్ద ఏర్పాటు చేసిన బ్రిడ్జిని ఇప్పటి వరకు పూర్తి చేయలేదు.పైగా ఈ బ్రిడ్జిని సగం వరకూ నిర్మించి వదిలి వేయటంతో వరద తాకిడికి కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

"ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రతి వర్షాకాలం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల సమస్యలు నెలకొంటున్నాయి. పరికి చెరువు నాలాకు ఇరువైపులా కంచెగోడలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నేటి వరకు నోచుకోలేదు. నాలాలో చెట్లు పెరిగిపోయి కూలి పడుతున్నాయి. విషపురుగులు సంచరిస్తున్నాయి. బ్రిడ్జిలు నిర్మించటంలో చిత్తశుద్ధి లేదు. ప్రజా ప్రతినిధులు అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలి. –కుమార్ యాదవ్, స్థానికుడు

పేదలకు న్యాయం చేయండి

కుత్బుల్లాపూర్: జీవో 58 ,59 కింద దరఖాస్తు చేసుకున్న పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి వారికి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో చేవెళ్ల ఎం.పీ రంజిత్ రెడ్డి ,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ప్రభుత్వ విప్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.



మణిపూర్ ఘటనపై ప్రధాని వైఖరి అనైతికం



టీపీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: మణిపూర్‌లో గత రెండు నెలలుగా జరుగుతున్న అల్లర్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నోరు విప్పక పోవటం దారుణమని టీపీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలపై దాడులు దేశం మొత్తం తలదించుకునేలా ఉన్నాయన్నారు. తక్షణమే మణిపూర్ సంఘటనలపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో అట్టడుగువర్గాలపై అగ్రవర్ణాలదాడులు పెరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మైనింగ్‌కు అనుకూలంగా ఉన్న గిరిజన ప్రాంతాలను ఆదానీకి కట్టబెట్టే కుట్రలో భాగంగా రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. మణిపూర్‌లో విధ్వంసాలకు అడ్డుకట్ట వేసి శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

మేడ్చల్ డీసీపీగా శబరీష్ బాధ్యతల స్వీకరణ



కుత్బుల్లాపూర్: మేడ్చల్ డీసీపీగా శబరీష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన డీసీపీ సందీప్ గోనె మాదాపూర్‌కు బదిలీపై వెళ్లడంతో నగరంలో జాయింట్ కమిషనర్‌గా పని చేస్తున్న శబరీష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. పేట్‌బషీరాబాద్, మేడ్చల్ ఏసీపీలతో పాటు శామీర్‌పేట్, అల్వాల్, జీడిమెట్ల, పేట్ బషీరాబాద్, మేడ్చల్, సూరారం, దుండిగల్ పోలీస్ స్టేషన్లు మేడ్చల్ డివిజన్ పరిధిలోకి వస్తాయి.. నేరాలను కట్టడి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తానని నూతన డీసీపీ శబరీష్ అన్నారు.. అంతకుముందు డీసీపీ సందీప్ ఆయన బొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన ఏసీపీ, సీఐలు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పేట్‌బషీరాబాద్ ఏసీపీగా రఘునందన్‌రావు నియమితులయ్యారు.

క్యాంప్ కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మెట్రో పార్కు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ నిర్మాణ పనులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం పరిశీలించారు. ఆఫీసులో చేపట్టాల్సిన మార్పులు, చేర్పులపై సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. కార్యాలయం చుట్టూ ఆహ్లాదకరమైన మొక్కలు పెంచాలని తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి

కూకట్‌పల్లి: మణిపూర్‌లో జరుగుతున్న అరాచకాలు, హత్యలకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని కోరుతూ కేపీహెచ్‌బీ కాలనీలోని గాంధీ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నేతలు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు దారుణమన్నారు. వాటికి అడ్డుకట్ట వేసి అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యవాదులందరు ఇలాంటి చర్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. మణిపూర్ జనాభాలో ఎక్కువగా ఉన్న మైటీ కులస్తులు, నాగ గిరిజన తెగల మధ్య బీజేపీ రాజకీయ లబ్ధి కోసం చిచ్చు పెడుతోందని ఆరోపించారు. గిరిజన తెగలపై రెండు నెలలుగా దాడులు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు బాధ్యత వహిస్తూ మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం రాజీనామా చేయాలని, దోషులను శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బిఎస్. సుదర్శన్, ఎం శంకర్, కె. కృష్ణ నాయక్, జే శివకుమార్, బి. గోపాల్, అనురాధ, ఎం. చంద్రశేఖర్, బి. శ్రీను, మంగయ్య నాయ్, మత్రు నాయక్, శంకర్ నాయక్, భాషా నాయక్, హనుమంతు, సురేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డులోని సెవెన్‌హిల్స్ కాలనీలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలోని సుమారు 227 గజాల ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేసి దేవాలయానికి వినియోగించుకోనున్నారు. ఇందులో భాగంగా భూదాన విరాళాల సేకరణకు రూపొందిచిన కరపత్రాన్ని ఎమ్మెల్యే గాంధీ ఆవిష్కరించారు. దేవుడి సేవ కోసం మంచి కార్యక్రమాన్ని చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. భూదానం స్కీమ్ కింద గజం స్థలానికి అయ్యే ఖర్చు రూ. లక్ష చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. భక్తులు ఎవరికి తోచిన సహాయాన్ని వారు అందించాలన్నారు. ఇప్పటికే రూ 27లక్షలు విరాళంగా సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, ఈఓ సత్యచంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ కెఆర్‌కె రాజు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, శ్రీహరి, కిరణ్, అప్పిరెడ్డి, కుమార్‌స్వామి, లక్ష్మీ, టీఆర్‌యస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, దామోదర్ రెడ్డి, పోతుల రాజేందర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ఇళ్లు కూలిన యజమానులకు కార్పొరేటర్ పరామర్శ...



బబ్బుగూడలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేందర్ తదితరులు

మోతీనగర్: ఇటీవల కురిసిన వర్షాలకు బబ్బుగూడలో ఇళ్లు కూలిపోయిన వారిని ఆదుకుంటామని మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. శనివారం ఆయన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద లబ్ధి చేకూరేలా చూస్తానని హామీ ఇచ్చారు. వర్షాల నేపథ్యంలో బస్తీ, కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని పాత ఇళ్లల్లో ఉన్నవారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మరో వారం రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రస్వామి, నాగరాజు, శ్రీధర్, సతీష్ చారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి..



సహాయక చర్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు.శనివారం ఆయన అధికారులతో కలిసి ఎల్లమ్మబండ ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీటిని పరిశీలించారు. జీహెచ్‌యంసి మాన్సూన్ ఎమర్జెన్సీ సిబ్బందిని పిలిపించి నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, నాయకులు పోశెట్టి గౌడ్, రవీందర్, సుధాకర్‌రెడ్డి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో అశోక్ చక్రవర్తికి జాతీయ పురస్కారం



అవార్డు అందుకున్న అశోక్ చక్రవర్తి

కూకట్‌పల్లి: సీఎంఏ స్పోర్ట్స్ ఫౌండేషన్ సహకారంతో వరల్డ్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో త్యాగరాయ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన మార్షల్ అర్ట్స్ ఎక్సలెన్స్– 2023 అవార్డుకు కూకట్‌పల్లికి చెందిన గ్రాండ్ మాస్టర్ అశోక్ చక్రవర్తి ఎంపికయ్యారు.న్యూ ఢిల్లీలో 21న జరిగిన పోటీల్లో తైక మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు అశోక్ చక్రవర్తి ఈ అవార్డు అందుకున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మార్షల్ ఆర్ట్స్ కోసం విశేష కృషి చేస్తున్న వారిని ఎంపిక చేసి ప్రతి సంవత్సరం పురస్కారాలను అందజేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి పోటీల్లో పాల్గొన్న తనకు నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఎక్సలెన్స్ జాతీయ అవార్డు లభించటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అవార్డు అందజేసిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

వరద నివారణకు ప్రత్యేక చర్యలు



వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్..

కుత్బుల్లాపూర్: లోతట్టు ప్రాంతాలు వరద ముంపు బారిన పడకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం ఆయన అధికారులతో కలిసి సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులోని మిత్ర హోమ్స్‌లోని ముంపు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదనీరు సాఫీగా వెళ్లేందుకు నాలాలు, కల్వర్టుల విస్తరణతో పాటు బాక్స్ డ్రెయిన్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గతంలో పోలిస్తే ముంపు సమస్య తీవ్రత తగ్గిందన్నారు. ఆయన వెంట డివిజన్ల అధ్యక్షులు పోలె శ్రీకాంత్, రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, సంపత్ మాధవ రెడ్డి, కస్తూరి బాల రాజు తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

◆ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్‌లోని స్మశాన వాటిక, డంపింగ్ యార్డ్ స్థలాలను ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్న నేపథ్యంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆయా ప్రాంతాలను సందర్శించారు. ఆక్రమణలను ఉపేక్షించేది లేదని, రూ.50 లక్షలతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

హష్ ఆయిల్ విక్రేతల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న హష్ ఆయిల్ బాటిల్స్‌తో డీసీపీ శ్రీనివాసరావు

జీడిమెట్ల: ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రాంతం నుంచి హష్ ఆయిల్ తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్న ముఠాను బాలానగర్ ఎస్వోటీ, మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్వోటీ అడిషనల్ డీసీపీ శోభన్, ఏసీపీ గంగారాంతో కలిసి డీసీపీ టి.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. సూరారం వెంకటరాంనగర్‌కు చెందిన యతేష్‌వర్మ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేసేవాడు. రాజీవ్ గృహ కల్పకు చెందిన మామిడి వెంకట హరికృష్ణ,, గాంధీ నగర్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్ స్నేహితులు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు వీరు హష్ ఆయిల్ కొనుగోలు చేసి నగరంలో విక్రయించాలని పథకం పన్నారు. ఇందులో భాగంగా పాడేరుకు చెందిన కొండ బాబును సంప్రదించారు. అతడి వద్ద నుంచి హష్ ఆయిల్ కొనుగోలు చేసి కూకట్‌పల్లి, నిజాంపేట పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో వారి కదలికలపై నిఘా పెట్టారు. శుక్రవారం బాచుపల్లి, ఎస్వోటీ పోలీసులు నిజాంపేట ఎక్స్‌రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వస్తున్న వారి వాహనాన్ని తనిఖీ చేయగా హష్ ఆయిల్ బయటపడింది. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 230 బాటిల్స్ హష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అంతేగాక సనత్‌నగర్ జీహెచ్ఎంసీ గ్రౌండ్ వద్ద ప్రవీణ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 70 బాటిల్స్(350 మిల్లీలీటర్లు) స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కూకట్‌పల్లిలో నాలుగు, చిక్కడపల్లి, ఆసిఫ్‌నగర్ ఠాణాల పరిధిలో ఒకటి చొప్పున కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసును చేధించిన ఎస్వోటీ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్‌ను డీసీపీ అభినందించారు. ఆరు నెలల వ్యవధిలో 150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వివరించారు.



పోలీసుల అదుపులో నిందితులు